సాక్షి
వరంగల్
సోమవారం । 29 । ఏప్రిల్ । 2024





తాటికొండ రాజయ్యను ఉద్దేశించి మాట్లాడుతున్న కేసీఆర్, చిత్రంలో అభ్యర్థి సుధీర్‌కుమార్, తదితరులు, హనుమకొండ చౌరస్తా వద్ద కార్నర్ మీటింగ్‌కు హాజరైన ప్రజానీకం

గులాబీ శ్రేణుల్లో జోష్

కేసీఆర్ రోడ్‌షోకు తరలివచ్చిన జనం

- అంబేడ్కర్ కూడలి, హనుమకొండ చౌరస్తా వరకు బస్సు యాత్ర
- దారిపొడవునా పూలవర్షం
- హనుమకొండ చౌరస్తాలో కార్నర్ మీటింగ్
- అభ్యర్థి సుధీర్‌కుమార్‌ను గెలిపించాలని కేసీఆర్ పిలుపు

సాక్షి, వరంగల్/హన్మకొండ: బీఆర్‌ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ బస్సు యాత్ర, రోడ్ షో బీఆర్ ఎస్ శ్రేణుల్లో జోష్ నింపింది. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం హనుమకొండలో నిర్వహించిన కేసీఆర్ రోడ్ షోకు భారీ సంఖ్యలో జనం తరలివచ్చారు. ప్రజలు సీఎం సీఎం అంటూ పెద్ద పెట్టున నినాదాలు చేశారు. అంబేడ్కర్ కూడలి నుంచి మొదలైన రోడ్ షో హనుమకొండ చౌరస్తాలో ముగిసింది. కేసీఆర్ రోడ్ షో దారిపొడవునా అభిమానులు పూలవర్షం కురిపించారు. కార్నర్ మీటింగ్ వద్ద జనం కిక్కిరిసిపోయారు.

ఉత్సాహం నింపిన ప్రసంగం

హనుమకొండ చౌరస్తాలో కేసీఆర్ ప్రసంగం క్యాడర్‌లో ఉత్సాహాన్ని నింపింది. 'చైతన్యం కలిగిన వరంగల్ జిల్లా.. ఉద్యమంలో 20 ఏళ్లుగా ఇక్కడి ప్రజలు నా వెంట ఉన్నారు. ఓరుగల్లు.. పోరుగల్లు అయితేనే తెలంగాణ వచ్చింది' అంటూ కేసీఆర్ పేర్కొన్నారు. కాళోజీ నారాయణరావు, ప్రొఫెసర్ జయశంకర్ పేరు వింటేనే పౌరుషం వస్తుందంటూ.. ఉత్సాహం నింపారు. సమైక్య రాష్ట్రంలో వెనుకబడిన వరంగల్‌లో.. పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో 30 అంతస్తుల సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి, మెగా టెక్స్‌టైల్స్ పార్కు, వైద్య విశ్వవిద్యాలయం, ఉమ్మడి వరంగల్ జిల్లాలో కొత్తగా ఐదు మెడికల్ కళాశాలలు ఏర్పాటు చేసుకున్నట్లు వివరించారు. బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులను పలకరిస్తూ.. తెలంగాణ ఉద్యమం ఆగిపోలేదని, అభివృద్ధి కోసం పోరాటం సాగించాల్సి ఉందని పిలుపునిచ్చారు. మే 13 వరకు ఇదే ఉత్సాహం కొనసాగించాలని, వరంగల్ లోక్‌సభ స్థానం నుంచి డాక్టర్ మారేపల్లి సుధీర్‌కుమార్‌ను గెలిపించి గులాబీ జెండా ఎగురవేయాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలయ్యాయా? అంటూ ప్రజల నుంచి సమాధానం రాబట్టారు. కార్యకర్తలు పార్టీ జెండాలు అడ్డుపెట్టడంతో 'బాబు జెండా తీయ్' అంటూ తనదైన శైలిలో చెప్పారు.



ర్యాలీగా వస్తున్న పార్టీ నేతలు, శ్రేణులు

వరంగల్‌కు వచ్చేవి కాళేశ్వరం నీళ్లే..

'ఇప్పుడున్న ముఖ్యమంత్రి చాలా చిత్రవిచిత్రంగా మాట్లాడుతున్నాడు. వరంగల్‌కు కాళేశ్వరం నీళ్లే రాలేదంటాడు. మరి నర్సంపేట, భూపాలపల్లి, మహబూబాబాద్, డోర్నకల్, పరకాల, వర్ధన్నపేట, పాలకుర్తిలో ఎక్కడి నుంచి వచ్చినవి. అంతకుముందు కాంగ్రెస్ రాజ్యంలో శ్రీరామ్ సాగర్ స్టేజ్–2 అని చెబితే దశాబ్దాలు గడిచినా.. నీటిబొట్టు రాలేదు. మీ సహకారంతో తెలంగాణ సాధించుకున్న తర్వాత కష్టపడి అన్నీ పూర్తి చేసి మధ్యలో కాళేశ్వరం నిర్మిస్తే వరంగల్ జిల్లాకు నీళ్లు వచ్చినవి. పసిడి రాశుల్లాంటి పంటలు పండినవి. నేను సీఎంగా ఉన్నప్పుడు కాజీపేటకు కోచ్ ఫ్యాక్టరీ కావాలని లేఖ రాస్తే ప్రధాని మోదీ తన రాష్ట్రం గుజరాత్‌కు ఎత్తుకెళ్లాడు. అదే విధంగా గిరిజన విశ్వ విద్యాలయం పదేళ్ల నుంచి వందసార్లు అడిగితే మొన్న ఎన్నికల ముందు కాగితం ఇచ్చిండు' అని కేసీఆర్ అన్నారు. ఈ బస్సు యాత్రలో వరంగల్ ఎంపీ అభ్యర్థి డాక్టర్ సుధీర్ కుమార్, శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, మాజీ ఎమ్మెల్యేలు చల్లా ధర్మారెడ్డి, దాస్యం వినయ్‌భాస్కర్, తాటికొండ రాజయ్య, నన్నపునేని నరేందర్, గండ్ర వెంకటరమణారెడ్డి, ఎమ్మెల్సీ మధుసూదనచారి పాల్గొన్నారు.

- రాత్రి 7.47 గంటలకు ఎన్పీడీసీఎల్ వద్దకు కేసీఆర్
- 8.25 గంటలకు హనుమకొండ చౌరస్తాకు చేరిక
- 8.35 గంటలకు ప్రసంగం ప్రారంభం
- 8.59 గంటలకు ముగింపు

కడియం రాజకీయ జీవితం సమాధి..

'ఇక్కడ ఓ మనిషికి టికెట్ ఇచ్చినం. ఉప ముఖ్యమంత్రి పదవి ఇచ్చినం. ఆయన పార్టీ ఎందుకు మారిపోయిండు. కడియం శ్రీహరి చేసిన మోసానికి శాశ్వతంగా రాజకీయ జీవితం సమాధి చేస్తామని మనవి చేస్తున్నా. ఇంకొక్క మూడు నెలల్లో సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం స్టేషన్‌ఘనపూర్ నియోజకవర్గానికి ఉప ఎన్నిక రాక తప్పదు. తాటికొండ రాజయ్య ఎమ్మెల్యే కాక తప్పదు. మీరు రాసి పెట్టుకోండి. నేను చెబుతున్నా.. జరగబోయే సత్యం ఇదే.. ద్రోహులకు చెప్పే గుణపాఠం అదే' అని కేసీఆర్ మాట్లాడారు. కార్నర్ మీటింగ్ అనంతరం ఆయన హనుమకొండలోని మాజీ ఎంపీ, కెప్టెన్ లక్ష్మీకాంతారావు నివాసానికి చేరుకున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పార్టీ నాయకులతో సమావేశమయ్యారు. రాత్రి అక్కడే బస చేశారు. సోమవారం ఉదయం బస్సుయాత్ర బయల్దేరి వర్ధన్నపేట, తొర్రూరు, మరిపెడ మీదుగా సాయంత్రానికి ఖమ్మం చేరుకోనుంది.



కళాకారులతో నృత్యం చేస్తున్న రాజయ్య

మంగళహారతులతో స్వాగతం..



బస్సుయాత్ర సాగిందిలా..

రోడ్ షో సాయంత్రం 6 గంటలకు ప్రారంభమవుతుందని పార్టీ నేతలు చెప్పినా.. 4.30 గంటల నుంచే ప్రజలు గుంపులు గుంపులుగా చేరుకున్నారు. కేసీఆర్ వచ్చే వరకు వేచి ఉన్నారు. హనుమకొండ నక్కలగుట్టలోని టీఎస్ ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయం వద్దకు రాత్రి 7.47 గంటలకు కేసీఆర్ బస్సు చేరుకుంది. అంబేడ్కర్ కూడలి నుంచి రోడ్ షో ప్రారంభం కావాల్సి ఉండగా పార్టీ కార్యకర్తలు, కేసీఆర్‌ను చూసేందుకు వచ్చిన జనం ముందుకు కదలనివ్వకపోవడంతో ఎన్పీడీసీఎల్ వద్దే బస్సు నిలిచిపోయింది. వరంగల్ జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి, రైతుబంధు సమితి హనుమకొండ జిల్లా కోఆర్డినేటర్ ఎల్లావుల లలితా యాదవ్, జెడ్పీటీసీ సభ్యురాలు చాడా సరిత బస్సులోకి వెళ్లి కేసీఆర్‌కు మంగళహారతితో స్వాగతం పలికారు. అనంతరం 7.49 గంటలకు బస్సు కదిలింది. రాత్రి 8.25 గంటలకు హనుమకొండ చౌరస్తాకు చేరుకుంది. 8.34 గంటలకు కేసీఆర్ బస్సుపైకి చేరుకుని ప్రజలకు అభివాదం చేశారు. 8.35 గంటలకు ప్రసంగం ప్రారంభించి 8.59 గంటలకు ముగించారు. 9.05 గంటలకు హనుమకొండ చౌరస్తా నుంచి బస్సు బయల్దేరింది.



బస్సులో కేసీఆర్, అభ్యర్థి సుధీర్‌కుమార్

న్యూస్‌రీల్

నిట్‌తో ఎల్‌అండ్‌టీ ఎంఓయూ



కాజీపేట అర్బన్: నిట్ వరంగల్‌తో గుజరాత్‌లోని ఎల్‌అండ్‌టీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్రాజెక్ట్ మెనేజ్‌మెంట్ వడోదర ఆదివారం ఎంఓయూ కుదుర్చుకుంది. నిట్ వరంగల్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుదీ, ఎల్‌అండ్‌టీ ఐపీఎం డీన్ రాజీవ్ నెహ్రూ పరస్పరం ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. ఇంజనీరింగ్ ప్రాజెక్టుల నిర్మాణం, నిర్వహణ, ఫ్యాకల్టీ సభ్యుల పరస్పర మార్పిడికి ఈ ఎంఓయూ తోడ్పడుతుందని నిట్ డైరెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో నిట్ ప్రొఫెసర్లు రతీశ్‌కుమార్, గుణేశ్వరరావు, రమాదేవి, అనిత తదితరులు పాల్గొన్నారు.

వికసించిన నాగమల్లి పుష్పం



కాజీపేట: కాజీపేట పట్టణంలోని శ్రీభ్రమరాంబిక మల్లికార్జున స్వామి దేవాలయం ఆవరణలో పుష్కర కాలం క్రితం నాటిన నాగమల్లి వృక్షానికి ఆదివారం పుష్పాలు వికసించాయి. వాటిని తిలకించడానికి భక్తులు క్యూ కట్టారు. నాగమల్లి పుష్పాలతో సోమవారం మల్లికార్జునుడికి ప్రత్యేక అభిషేకం చేయనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు అయిన వోలు ప్రవీన్ కుమార్ శర్మ తెలిపారు. ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులతో పాటు శివ–శక్తి యూత్ అసోసియేషన్ సభ్యులు, పుర ప్రముఖులు హాజరవుతున్నట్లు తెలిపారు.

నేటి వరంగల్ ప్రజావాణి రద్దు

కాళోజీ సెంటర్: వరంగల్ కలెక్టరేట్‌లో సోమవారం(నేడు) నిర్వహించే ప్రజావాణిని రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ పి.ప్రావీణ్య ఒక ప్రకటనలో తెలిపారు. అధికారులు, సిబ్బంది పార్లమెంట్ ఎన్నికల విధుల్లో నిమగ్నమై ఉన్నందున ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ విషయాన్ని గమనించి ప్రజలు ఫిర్యాదులు ఇవ్వడానికి కార్యాలయానికి రావొద్దని కోరారు.

వరంగల్ రైల్వేస్టేషన్‌లో ఆర్‌పీఎఫ్ తనిఖీలు



కాశిబుగ్గ: వరంగల్ రైల్వేస్టేషన్, రైళ్లలో ఆదివారం రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్(ఆర్‌పీఎఫ్) బృందం ప్రత్యేక తనిఖీలు నిర్వహించింది. ఈ సందర్భంగా రైళ్లలో, రైల్వే స్టేషన్‌లో అనుమతి లేకుండా విక్రయాలు జరుపుతున్న, అధిక ధరలకు వస్తువులు అమ్ముతున్న, నాణ్యత లేని, గడువు తీరిన వస్తువులు విక్రయిస్తున్న వారిని గుర్తించి కేసులు నమోదు చేశారు. అనంతరం ఆర్‌పీఎఫ్ సీఐ టీఎస్‌ఆర్ కృష్ణ మాట్లాడుతూ గడువు తీరిన, నాణ్యత లేని వస్తువులు విక్రయించిన.. అధిక ధరలకు అమ్మిన వారిపై రైల్వే యాక్ట్ ప్రకారం కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఆదివారం 15 మందిపై కేసులు నమోదు చేశామని, జనవరి నుంచి ఇప్పటి వరకు 540 మందిపై కేసులు నమోదు చేసినట్లు వివరించారు. తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని చెప్పారు.

క్రికెట్ బెట్టింగ్ స్థావరంపై దాడి

- రూ.5వేల నగదు, మొబైల్ స్వాధీనం

ఖిలా వరంగల్ : ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్ బెటింగ్ స్థావరంపై మిల్స్‌కాలనీ ఇన్‌స్పెక్టర్ మల్లయ్య ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి పోలీసులు దాడి చేసి, ఐదుగురు బెట్టింగ్ రాయుళ్లను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. వరంగల్ శంభునిపేట దూపకుంట రోడ్డు గిరిప్రసాద్ నగర్ కాలనీలో ఎండీ నవాజ్ ఇంటి పక్కన ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్ బెట్టింగ్ కొనసాగుతున్నట్లు ఏసీపీ నందిరాం నాయక్‌కు విశ్వసనీయ సమాచారం అందింది. దీంతో పెట్రోలింగ్‌కు వెళ్లిన ఎస్సై గోవర్ధన్ తన సిబ్బందితో కలిసి నవాజ్ ఇంటి పక్కన ఆన్‌లైన్ బెట్టింగ్ స్థావరంపై ఆకస్మిక దాడి చేశారు. ఈదాడిలో గిరిప్రసాద్‌నగర్‌కు చెందిన ఆటోడ్రైవర్ ఎండీ నవాజ్, ఎండీ ఆసీఫ్, ఎండీ ఫరూక్, ఎస్.కె నూరుద్దీన్, ఎండీ రంజాన్ పట్టుబడ్డారు. వీరి నుంచి రూ.5వేల నగదు, మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకుని ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

బీజేపీ, బీఆర్‌ఎస్‌కు ఓటు అడిగే హక్కులేదు

- పోరిక బలరాం నాయక్



సమావేశంలో మాట్లాడుతున్న బలరాం నాయక్

నల్లబెల్లి: పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలకు ఓటు అడిగే హక్కులేదని మహబూబాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పోరిక బలరాంనాయక్ అన్నారు. మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం నిర్వహించిన మహబూబాబాద్ పార్లమెంట్ ఎన్నికల ముఖ్య కార్యకర్తల సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన కాంగ్రెస్ పార్టీకి శాసనసభ ఎన్నికల్లో ప్రజలు బ్రహ్మరథం పట్టారని, పార్లమెంట్ ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కేసీఆర్ అవినీతి పాలనను ప్రజలు వ్యతిరేకిస్తున్నారని, మరో 20ఏళ్లు కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారంలో ఉంటుందని ధీమా వ్యక్తం చేశారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి మాట్లాడుతూ.. బలరాం నాయక్‌కు నర్సంపేట నియోజకవర్గం నుంచి అత్యధిక మెజార్టీ అందించాలని అన్నారు. బలరాం నాయక్ గెలుపు కోసం కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని పిలుపునిచ్చారు. మండలంలోని రంగాపురం గ్రామానికి చెందిన వివిధ పార్టీలకు చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి మాధవ రెడ్డి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. సమావేశంలో నాయకులు తక్కళ్లపల్లి రవీందర్ రావు, పాల్వాయి శ్రీనివాస్, చిట్యాల తిరుపతి రెడ్డి, రమేష్, అశోక్, ఇస్తారి శేఖర్ పాల్గొన్నారు.

బీజేపీని గెలిపిస్తేనే దళితులకు న్యాయం

- బీజేపీ దళిత మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్



సభలో అభివాదం చేస్తున్న బీజేపీ నేతలు

వర్ధన్నపేట: బీజేపీకి ఓటేసి గెలిపిస్తేనే దేశంలో దళితులకు న్యాయం జరుగుతుందని బీజేపీ దళిత మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్ అన్నారు. ఆదివారం మండలంలోని ఇల్లంద శివారులోని ఓ ఫంక్షన్ హాలులో కొండేటి శ్రీధర్ ఆధ్వర్యంలో ఎస్సీ మోర్చా సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి అరూరి రమేశ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ దళితులను అవమానపరిస్తే మోదీ అక్కున చేర్చుకున్నారని గుర్తు చేశారు. అందుకు సాక్ష్యం మాదిగల సభకు ప్రధాని మోదీయే ముఖ్య అతిథిగా హాజరైన విషయాన్ని గుర్తు చేశారు. మాదిగ బిడ్డనైన తనకు పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం ఇచ్చారన్నారు. అదే విధంగా దళితుడైన రామ్‌నాథ్ కోవింద్‌ను రాష్ట్రపతిని చేశారన్నారు. కొండేటి శ్రీధర్ మాట్లాడుతూ.. కడియం శ్రీహరి టీడీపీ, బీఆర్‌ఎస్ పార్టీలో ఉన్నత పదవులు అనుభవించి ఏ ఒక్క దళితుడిని ఎదగనీయకుండా అణగదొక్కాడన్నారు. ప్రస్తుతం సైతం కాంగ్రెస్ పార్టీలో ఉన్న దళిత నాయకులకు టికెట్ దక్కకుండా చేసి తన బిడ్డకు అవకాశం పొందారని ఎద్దేవా చేశారు. మాజీ ఎమ్మెల్యేలు వన్నాల శ్రీరాములు, తక్కళ్లపెల్లి రాజేశ్వర్‌రావు, అసెంబ్లీ కన్వీనర్ ముత్తిరెడ్డి కేశవరెడ్డి, జెడ్పీవైస్ చైర్మన్ గజ్జెల్లి శ్రీరాములు, రాష్ట్ర కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు తిరుపతిరెడ్డి, కౌన్సిలర్ కొండేటి అనిత సత్యం, జిల్లా ప్రధాన కార్యదర్శి గాడిపెల్లి రాజేశ్వర్‌రావు, మండల పార్టీ అధ్యక్షుడు రాయపురం కుమారస్వామి, నాయకులు మహేందర్ పాల్గొన్నారు.

వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించాలి



రికార్డులను పరిశీలిస్తున్న ధీరజ్‌సింగ్

పర్వతగిరి: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని ఎన్నికల వ్యయ పరిశీలకుడు ధీరజ్‌సింగ్ సూచించారు. ఈ మేరకు వర్ధన్నపేట అసెంబ్లీ సెగ్మెంట్ పరిధి పర్వతగిరి మండలంలోని చింతనెక్కొండ చెక్‌పోస్టును ఆదివారం ఆకస్మికంగా సందర్శించారు. స్టాటిక్ సర్వేలెన్స్ టీం నిర్వహణ, రికార్డులను పరిశీలించారు.అప్రమత్తతతో చెక్‌పోస్టుల వద్ద విధులు నిర్వహించాలని,అక్రమంగా మద్యం, నగదు సరఫరా కాకుండా పటిష్టంగా నిఘా పెట్టాలని సూచించారు. సహాయ వ్యయ అధికారి నాగనారాయణ, ఎల్‌ఓ నయీమ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ వెంచర్‌కు చెరువు మట్టి

- కబ్జాకు గురవుతున్న కుంటలు
- ఎఫ్‌టీఎల్ పరిధిలో బండ్ నిర్మాణానికి వినియోగం
- పట్టించుకోని రెవెన్యూ అధికారులు



వెంచర్ బండ్‌కు ఉపయోగిస్తున్న చెరువు మట్టి

మడికొండ: కాజీపేట మండలం మడికొండ–ధర్మసాగర్ ఔటర్ రింగ్ రోడ్డును ఆనుకుని ఉన్న పరికికుంట పక్కన రియల్ ఎస్టేట్ వ్యాపారి ఓ వెంచర్ ఏర్పాటు చేస్తున్నారు. వెంచర్‌కు ఆనుకొని పరికికుంట ఉండడంతో ఎఫ్‌టీఎల్ పరిధిలో బండ్‌ను నిర్మిస్తున్నారు. ఇందుకు చెరువులోని మట్టిని యథేచ్ఛగా వాడుకుంటున్నారు. రాత్రి సమయంలో జేసీబీల సాయంతో కుంటలోని మట్టిని తరలించి వెంచర్‌కు వాడుకుంటున్నారు. అధికారులకు ఈ విషయం తెలిసినా స్పందించడం లేదని స్థానిక ప్రజలు వాపోతున్నారు. రైతులకు ఉపయోగపడే మట్టి వెంచర్‌కు తరలించడం ఎంత వరకు న్యాయమని రైతులు ప్రశ్నిస్తున్నారు. రైతుల పొలాల్లోకి మట్టి తరలించాలంటే అధికారులు ఎక్కడా లేని కొర్రీలు పెడతారని, ప్రైవేట్ వెంచర్ నిర్వాహకుడు మాత్రం ట్రాక్టర్ల కొద్దీ తరలిస్తున్నా.. ఎవరూ పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు.

మాజీ ఎమ్మెల్యే బినామీగా ప్రచారం

గ్రామంలో సదరు వెంచర్ నిర్వాహకుడు ఓ మాజీ ఎమ్మెల్యే బినామీగా ప్రచారం జరుగుతోంది. ఎమ్మెల్యే పేరుతో నగరం చుట్టుపక్కల అనేక వెంచర్లు ఇతడి ఆధ్వర్యంలోనే నడుస్తున్నట్లు స్థానికులు పేర్కొంటున్నారు. అందుకే ఏ ఒక్క అధికారి కూడా పట్టించుకోవడం లేదని చర్చ జరుగుతోంది. రైతులకు ఉపయోగపడే మట్టిని వెంచర్‌కు ఎలా ఇస్తారని వాపోతున్నారు. వెంచర్ సైతం చెరువు శిఖంలోకి వచ్చినట్లు వాపోతున్నారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు స్పందించి వెంచర్ నిర్వాహకుడిపై తగిన చర్యలు తీసుకుని ఎఫ్‌టీఎల్ హద్దులు నిర్ణయించాలని కోరుతున్నారు.

కట్టను తొలగించి.. చదును

కొంత మంది దళారులు పరికి కుంట కట్టను తొలగించి సుమారు 10 గుంటల వరకు చదును చేసి వారిపేరు మీదికి పట్టా చేయించున్నారు. దీనిపై ఎవరూ పట్టించుకోవడం లేదు. వీఆర్‌ఓ వ్యవస్థ రద్దయిన తర్వాత ఎవరికి వారు ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారు. గతంలో పరికికుంట చెరువును రెవెన్యూ సిబ్బంది సర్వే నిర్వహించి హద్దులు సైతం నిర్ణయించారు. ఇప్పడు హద్దులు లేకుండా చేశారు కబ్జాదారులు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెరువు స్థలం కబ్జా కాకుండా చూడాలని రైతులు కోరుతున్నారు.

తాగునీటి ఇబ్బందులు తలెత్తొద్దు



భట్టుపల్లిరోడ్డులో తాగునీటి పైపులైన్లను పరిశీలిస్తున్న కమిషనర్

వరంగల్ అర్బన్/కాజీపేట అర్బన్: 'ఎండలు విపరీతంగా పెరిగాయి.. నగర ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలి' అని గ్రేటర్ వరంగల్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అధికారులకు సూచించారు. ఆదివారం వరంగల్ భట్టుపల్లి, రాంపూర్, కాజీపేట మండలం కడిపికొండ, కుమ్మరిగూడెం ప్రాంతాల్లో ఆమె తనిఖీలు నిర్వహించారు. వరంగల్ అండర్ రైల్వేగేట్ జోన్‌లో ధర్మసాగర్ 60ఎంఎల్‌డీ ద్వారా జరిగే నీటి సరఫరాలో ఇటీవల ఎదురవుతున్న అవంతరాలను తెలుసుకున్నారు. పైపులైన్ల ఫ్లోమీటర్లను, ఎయిర్ వాల్వ్‌లను కమిషనర్ పరిశీలించి పలు సూచనలు చేశారు. నీటి సరఫరా పునరుద్ధరణకు త్వరితగతిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. తనిఖీల్లో ఎస్‌ఈ ప్రవీణ్‌చంద్ర, ఈఈ రాజయ్య, పబ్లిక్ హెల్త్ ఈఈ రాజ్‌కుమార్, డీఈ సంతోశ్‌బాబు, వర్క్ ఇన్‌స్పెక్టర్ కోటి తదితరులు పాల్గొన్నారు.

ఫుడ్ ప్రాసెసింగ్‌లో మహిళల పనితీరు అద్భుతం

- సెర్ప్ స్టేట్ ప్రాజెక్టు మేనేజర్ శ్రీనివాస్



బేకరి ఉత్పత్తుల తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

వర్ధన్నపేట: సెర్ప్ సిబ్బంది సలహాలు, సూచనలతో వరంగల్ జిల్లా మహిళలు వివిధ రకాల ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను అద్భుతంగా నిర్వహిస్తున్నారని సెర్ప్ స్టేట్ ప్రాజెక్టు మేనేజర్ సీహెచ్ శ్రీనివాస్, కోఆర్డినేటర్ చంద్రశేఖర్ అన్నారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా మండలంలోని ఇల్లంద గ్రామంలో పీఎంఎఫ్ఎంఈ స్కీం ద్వారా రూ.10లక్షలతో ఏర్పాటు చేసిన ఫుడ్ ప్రాసెసింగ్ (బేకరి ఉత్పత్తుల తయారీ) కేంద్రాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ముందుగా డీఆర్‌డీఓ కౌసల్యాదేవిని తన చాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడతూ.. మహిళలు రాష్ట్రంలోనే మొదటిసారిగా సూర్యోదయ రైతు ప్రొడ్యూసర్ కంపెనీ(ఎఫ్‌పీసీ) ద్వారా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం అభినందనీయం అన్నారు. వీరి వెంట జిల్లా ప్రాజెక్టు మేనేజర్, ఏపీఎంలు వేణు, కిరణ్, సీసీ గోలి కొమురయ్య, వీఓఏ రమ్య, నిర్వాహకులు, వీఓ ప్రతినిధులు ఉన్నారు.

ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మిద్దాం

మామునూరు: ఔషధ రంగంలో కృత్రిమ మేధస్సును ఉపయోగించుకుని మరింత మెరుగైన పరిశోధనలు చేపట్టి సంపూర్ణ ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మిద్దామని ఇండియన్ ఫార్మాస్యూటికల్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు టీ.వీ నారాయణ, ఐపీఏ పూర్వ అధ్యక్షుడు డాక్టర్.రావ్ వడ్లమూడి అన్నారు. ఖిలా వరంగల్ మండలం బొల్లికుంట వాగ్దేవి ఫార్మసీ కళాశాలలో 'ఆల్ ఇండియా ఫార్మా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఇన్ ఫార్మాస్యూటికల్ రీసెర్చ్ అండ్ హెల్త్‌కేర్' అంశంపై మూడ్రోజులుగా జరుగుతున్న అంతర్జాతీయ సదస్సు ఆదివారం ముగిసింది. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆరోగ్య రంగంలో మానవ జాతికి వైద్య సేవలను మరింత సులువు, వేగంగా అందించి జీవన ప్రమాణాల్ని మరింత పెంచవచ్చని పేర్కొన్నారు. ఔషధ రంగంలో కృత్రిమ మేధస్సును ఉపయోగించుకుని చేపట్టే పరిశోధనలతో వచ్చే ఫలితాలు అద్భుతాలు సృష్టిస్తాయని చెప్పారు.సమావేశంలో వాగ్దేవి విద్యాసంస్థల చైర్మన్ సీహెచ్.దేవేందర్‌రెడ్డి, ఎస్వీఎస్ శర్మ, డాక్టర్ ఎస్.రఘునందన్, డాక్టర్ కమల్‌యాదవ్, అమెరికా ఫార్మాస్యూటికల్స్ డైరెక్టర్ రెండ్ల రవీందర్, మలేషియా ప్రొఫెసర్ మహమ్మద్ తాహీర్ అన్సారీ, క్లినోసాల్ రీసెర్చ్ ఫౌండర్ సీఎస్ ముజాబుద్దీన్, సాయిసతీశ్, ఉమాషీయ పాల్గొన్నారు.

క్లుప్తంగా

గన్ మిస్ ఫైర్..

● ఏఆర్ కానిస్టేబుల్‌కు గాయాలు



వరంగల్: ఏనుమాముల మార్కెట్‌లో ఈవీఎంలు భద్రపర్చిన గోదాం(నంబర్–12) వద్ద విధులు నిర్వర్తిస్తున్న ఏఆర్ కానిస్టేబుల్ ఎ.రాజేష్ గన్ మిస్‌ఫైర్ కావడంతో అతడి ఎడమ కాలికి గాయాలు అయినట్లు స్థానిక పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ పులి రమేష్ తెలిపారు. నగరంలోని కరీమాబాద్‌కు చెందిన రాజేష్ 20రోజులుగా గోదాం వద్ద విధులు నిర్వహిస్తున్నట్లు తెలిసింది. ఆదివారం రాజేష్ విధుల్లో ఉన్న సమయంలో ఆయన వద్ద ఉన్న ఎస్ఎల్ఆర్ గన్ ప్రమాదవశాత్తు కింద పడి ఫైర్ అయి.. ఈ ప్రమాదం జరిగిందని, గాయపడిన రమేష్‌ను వెంటనే చికిత్స నిమిత్తం ఎంజీఎంకు తరలించినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. ఎలాంటి ప్రమాదం లేదని వైద్యులు చెప్పినట్లు వివరించారు.

డంపింగ్ యార్డులో ఎగిసిన మంటలు



మంటలు ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

ఖిలా వరంగల్: వరంగల్ ఉర్సు గుట్ట వద్ద మహానగరపాలక సంస్థ ఏర్పాటు చేసిన చెత్త డంపింగ్ యార్డులో రెండో రోజు ఆదివారం సాయంత్రం మంటలు ఎగిసిపడ్డాయి. సమాచారం అందుకున్న వరంగల్ ఫైర్ అధికారి శ్రీనివాస్ ఆధ్వర్యంలో సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని మంటలు ఆర్పివేశారు. స్థానిక కార్పొరేటర్ మరుపల్లి రవితో కలిసి నగరపాలక సంస్థ అధికారులు పరిస్థితిని ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు చేరవేస్తూ సమీక్షించారు. ఎవరికి ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం వాటిల్లలేదని ఫైర్ అధికారి శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో బల్దియా సూపర్‌వైజర్ సాంబయ్య, జవాన్ జీవన్, కృష్ణ, ప్రశాంత్ పాల్గొన్నారు.

తప్పు.. తప్పదు మూల్యం

● ప్రచారంలో చిన్న పొరపాటు మాట్లాడిన క్షణాల్లో వైరల్
● సోషల్ మీడియాకు దొరికితే ఇక అంతే..





కాజీపేట : లోక్‌సభ ఎన్నికల ప్రచారం ఊపందుకోవడంతో జిల్లా రాజకీయాలు వేడెక్కుతున్నాయి. ప్రచార సమయంలో అభ్యర్థులు, నాయకులు ఏ మాత్రం తప్పుగా మాట్లాడుతూ దొరికితే చాలు.. సోషల్ మీడియాలో నెటిజన్లు క్షణాల్లో వైరల్ చేస్తున్నారు. రాజకీయ పార్టీల అనుచర వర్గాలు అనుకూల, వ్యతిరేక కథనాలతో యుద్ధ వాతావరణం సృష్టిస్తూ ఓటర్లలో గందరగోళం సృష్టిస్తున్నాయి. గత ఎన్నికలతో పోల్చితే ఈ ఎన్నికల్లో సోషల్ మీడియా మరింత చురుగ్గా పని చేస్తోంది. ప్రత్యర్థులు ఏ చిన్న పొరపాటును వదిలి పెట్టకుండా ఉతికి ఆరేస్తున్నారు. గతంలో ఒక పార్టీలో ఉన్నప్పుడు మాట్లాడిన మాటలు.. ప్రస్తుతం పార్టీ మారగానే ఆయా పార్టీలకు అనుకూలంగా మాట్లాడుతున్న మాటలు సోషల్ మీడియా వేదికగా వైరల్ చేస్తున్నారు.

ఖర్చు లేకుండా సోషల్ మీడియాలో ప్రచారం..

అధిష్టాన వర్గాల ఆలోచనలకు అనుగుణంగా ఎన్నికల ప్రచారంలో సోషల్ మీడియాను ఎక్కువగా వినియోగించుకుంటున్నారు. బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్‌తోపాటు అనేక పార్టీలు సోషల్ మీడియాను ఎక్కువగా వినియోగించుకుంటున్నాయి. కొన్ని పార్టీలు ప్రత్యేక యాప్ రూపకల్పన చేసి వినియోగించుకుంటున్నాయి. వాట్సాప్, ట్విట్టర్, ఫేస్‌బుక్, టెలిగ్రామ్ వంటి సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లను ప్రచారానికి ఉపయోగించుకుంటూ ఫలితం సాధించాలని యత్నిస్తున్నాయి.

అయోమయంలో ప్రజలు..

సోషల్ మీడియాలో కథనాలు, ప్రచారం, గెలుపు, ఓటములపై పోలింగ్ నిర్వహిస్తున్నారు. తమకు అనుకూల కథనాలతో తప్పుడు ప్రచారం నిర్వహిస్తూ సోషల్‌మీడియాను హోరెత్తిస్తున్నారు. ఫలితంగా అభ్యర్థులతో పాటు ప్రజలు అయోమయానికి గురవుతున్నారు.

నేడు మానుకోటకు 'నడ్డా'



ఏర్పాట్లను పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

● సభా స్థలిని పరిశీలించిన బీజేపీ నాయకులు

మహబూబాబాద్ అర్బన్: బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా సోమవారం మానుకోటకు రానున్నారు. ఈ నేపథ్యంలో రాజ్యసభ మాజీ సభ్యుడు గరికపాటి మోహన్‌రావు, కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి, ఎంపీ అభ్యర్థి అజ్మీరా సీతారాంనాయక్, పార్లమెంట్ ప్రభారి నూకల వెంకట్‌నారాయణ రెడ్డి జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన సభాస్థలిని ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా గరికపాటి మోహన్‌రావు మాట్లాడుతూ మానుకోటలో నేడు మధ్యాహ్నం 2 గంటలకు జరిగే జనసభలో బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా పాల్గొంటారన్నారు. ఈ సభకు సుమారు 40 వేల మంది ప్రజలు రానున్నారని తెలిపారు. అలాగే, త్వరలో మానుకోట, ఖమ్మం పార్లమెంట్ పరిధిలో జరిగే సభల్లో ప్రధాని మోదీ, కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా పాల్గొంటారన్నారు. ఆదిలాబాద్, మానుకోట గిరిజన పార్లమెంట్ నియోజకవర్గాలపై బీజేపీ ప్రత్యేక శ్రద్ధ వహించిందన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు యలమంచిలి వెంకటేశ్వరరావు, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, సింగారపు సతీష్, శ్యామ్‌సుందర్‌శర్మ, సిరికొండ సంపత్, ఆకుల శ్రీనివాస్, పైండ్ల శ్రీనివాస్, సురేందర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కే మాదిగల మద్దతు

● మోదీపై విశ్వాసం లేదు
● ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపయ్యమాదిగ



ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపయ్య మాదిగ

హన్మకొండ : కాంగ్రెస్ పార్టీకే మాదిగలు సంపూర్ణ మద్దతు తెలుపుతున్నారని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపయ్య మాదిగ అన్నారు. ఆదివారం హనుమకొండ నక్కలగుట్టలోని ఓ హోటల్‌లో జరిగిన ఎమ్మార్పీఎస్ వరంగల్ పార్లమెంట్ స్థాయి కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. 80 లక్షల మంది మాదిగలు కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయడం ద్వారానే రేవంత్‌రెడ్డి సీఎం అయ్యారని, ముఖ్యమంత్రి అయిన నెల రోజుల్లోనే నామినేట్ పదవుల్లో మాదిగలకు ప్రాధాన్యం కల్పించినట్లు చెప్పారు. పార్టీ అంతర్గత అంశంలో భాగంగా ఎంపీగా మాదిగలకు అవకాశం కల్పించలేకపోయామని, రాబోయే రోజుల్లో రెండు ఎమ్మెల్సీ పదవులతో పాటు ఒక రాజ్యసభ స్థానానికి అవకాశం కల్పిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. 20 ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టులో పోరాడేందుకు సీనియర్ న్యాయవాదిని నియమించినట్లు పేర్కొన్నారు. పదేళ్లు అధికారంలో ఉండి ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించలేని ప్రధాని మోదీ ఇప్పుడు వర్గీకరణకు కట్టుబడి ఉన్నామని మాట్లాడడం మాదిగలను మోసం చేయడమేనని అన్నారు. దేశంలో ఎన్నో జటిల సమస్యలు పరిష్కరించిన మోదీ సర్కారుకు ఎస్సీ వర్గీకరణ పెద్ద సమస్య కాదన్నారు. మాదిగలపై చిన్నచూపు, నిర్లక్ష్యం వల్లే నాన్చివేత ధోరణి అవలంబిస్తున్నారని విమర్శించారు. మాదిగలకు మోదీపై విశ్వాసం లేదని, బీజేపీకి మాదిగలు ఓటు వేయొద్దని పిలుపునిచ్చారు. పార్లమెంట్ ఎన్నికల్లో మాదిగలంతా కాంగ్రెస్‌కు ఓటు వేసి గెలిపించాలన్నారు.

ప్రభుత్వంలో భాగస్వామి అయితేనే అభివృద్ధి

● బీజేపీ స్టార్ క్యాంపెయినర్ డాక్టర్ టి.రాజేశ్వర్‌రావు



మాట్లాడుతున్న రాజేశ్వర్‌రావు

హన్మకొండ : పార్లమెంట్‌కు వెళ్లాల్సింది ప్రశ్నించే వ్యక్తి కాదు.. ప్రభుత్వంలో భాగస్వామి అయ్యే వ్యక్తి వెళ్తే అభివృద్ధి పరుగులు పెడుతుందని బీజేపీ స్టార్ క్యాంపెయినర్ డాక్టర్ టి.రాజేశ్వర్‌రావు అన్నారు. ఆదివారం హనుమకొండ హంటర్‌రోడ్డులోని బీజేపీ పార్లమెంట్ ఎన్నికల కార్యాలయంలో ఆయన విలేరులతో మాట్లాడుతూ కాంగ్రెస్‌లో చేరగానే కడియం శ్రీహరికి ఏం మాట్లాడాలో తోచడం లేదని, మోదీ ప్రధాని అయితే ప్రజాస్వామ్యం ఉండదని అనడం విడ్డూరంగా ఉందన్నారు. ఎమర్జెన్సీని తీసుకువచ్చి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిన కాంగ్రెస్ పార్టీ ప్రజాస్వామ్యాన్ని కాపాడుతుందని కడియం శ్రీహరి ఇంగితజ్ఞానం లేకుండా మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు. 2004–2010 నాలుగుసార్లు ఎస్సీ, ఎస్టీ, బీసీల రిజర్వేషన్లు తగ్గించి మైనార్టీలకు ఇచ్చే ప్రయత్నం చేసింది.. ప్రైవేటీకరణను తీసుకువచ్చింది కూడా ఆ పార్టీనేనని అన్నారు. బీజేపీ అధికారంలోకి వస్తే రిజర్వేషన్లు ఎత్తివేస్తుందని అనడాన్ని ఖండించారు. ప్రధాని మోదీని విమర్శించే స్థాయి కడియంకు లేదన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఎక్కువ కాలంగా మంత్రిగా పనిచేసి జిల్లా అభివృద్ధి చెందలేదని మాట్లాడటం ఆయన చేతగాని తనానికి నిదర్శనమని ధ్వజమెత్తారు. 20 ఏళ్లుగా చేయని అభివృద్ధి ఇప్పుడు కూతురు చేస్తుందని చెప్పడం హాస్యాస్పదంగా ఉందని చెప్పారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే వన్నాల శ్రీరాములు, బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ, పార్లమెంటరీ ప్రభారి వి.మురళీధర్‌గౌడ్, కన్వీనర్ తాళ్లపెల్లి కుమారస్వామి, నాయకులు కందగట్ల సత్యనారాయణ, చల్లా జయపాల్‌రెడ్డి, ఓంప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఫ్లయింగ్ స్క్వాడ్ దాడులు..

● రూ. 20,567 విలువైన మద్యం స్వాధీనం

ఐనవోలు : మండలంలోని పంథిని గ్రామంలోని బెల్టు షాపుపై ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు ఆదివారం దాడులు నిర్వహించారు. ఇందులో రూ. 20,567 విలువైన మద్యం స్వాధీనం చేసుకున్నారు. షాపు నిర్వహిస్తున్న పుల్లూరి మల్లికార్జున్‌పై కేసు నమోదు నిమిత్తం ఐనవోలు పోలీసులకు అప్పగించారు. కార్యక్రమంలో ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి ఎన్ జీవన్ కుమార్, ఏఎస్సై సదానందం, కానిస్టేబుల్ రాకేష్ తదితరులు పాల్గొన్నారు.



భూమి రిజిస్ట్రేషన్ పనులకు వచ్చి అనంతలోకాలకు..

● రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం
● మరో ఇద్దరికి గాయాలు
● లింగాలఘణపురంలో ఘటన



రఘు (ఫైల్)

లింగాలఘణపురం : రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం చెందాడు. ఈ ఘటన మండలంలోని నెల్లుట్ల–లింగాలఘణపురం రోడ్డులో లింగాలఘణపురం లక్ష్మీనర్సింహ రైస్ మిల్లు వద్ద జరిగింది. పోలీసుల కథనం ప్రకారం లింగాలఘణపురానికి చెందిన గంగదారి వీరరాఘవేంద్ర అలియాస్ రఘు (30) హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్‌గా పనిచేస్తున్నాడు. భూమి రిజిస్ట్రేషన్ పనుల నిమిత్తం రెండు రోజు క్రితం స్వగ్రామం లింగాలఘణపురం వచ్చాడు. ఈ క్రమంలో ఆదివారం తన స్నేహితుడు చిత్తూరు జిల్లాకు చెందిన ధ్రువ (సాఫ్ట్‌వేర్)తో కలిసి ద్విచక్రవాహనంపై నెల్లుట్ల నుంచి లింగాలఘణపురం వస్తున్నారు. లక్ష్మీనర్సింహ రైస్ మిల్లు వద్ద ఎదురుగా వస్తున్న నెల్లుట్లకు చెందిన బండ్రు పరశురాములు ద్విచక్రవాహనాన్ని ఢీకొన్నారు. ఈ ఘటనలో రఘు తీవ్రంగా గాయపడగా, ధ్రువ, పరశురాములకు స్వల్పగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వెంటనే రఘును 108లో జనగామ ఏరియా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ధ్రువను మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలించారు. కాగా, రఘు అవివాహితుడు. రఘు తల్లిదండ్రులు కొంతకాలం క్రితం మృతి చెందగా ఇద్దరు అక్కలు ఉన్నారు.

హెల్మెట్ ధరిస్తే బతికేటోడేమో..

రఘు వద్ద హెల్మెట్ ఉన్నప్పటికీ పెట్టుకోకుండా బైక్‌కు పెట్టాడు. రోడ్డు ప్రమాదంలో హెల్మెట్ ఎగిరి రోడ్డు పక్కన పడింది. రఘు రోడ్డుపై పడడంతో తలకు బలమైన గాయాలతో తీవ్ర రక్తస్రావమై మృతి చెందాడు. హెల్మెట్ ధరిస్తే బతికేటోడేమోనని ఘటనను చూసిన వారంతా చర్చించుకున్నారు. కాగా, వడిచర్లలో ఎంపీటీసీ సిద్దు వివాహానికి హాజరై లింగాలఘణపురం మీదుగా జనగామ వైపునకు వెళ్తున్న మాజీ ఎమ్మెల్యే రాజయ్య.. ఘటనను చూసి రఘుకు ప్రాథమిక చికిత్స అందించారు. ఈ ఘటనపై మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చింత రాజు తెలిపారు.

నేతావత్ తండా సమీపంలో లారీ ఢీకొని యువకుడు..

మరిపెడ రూరల్: ఎదురుగా వస్తున్న బైక్‌ను లారీ ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా మరిపెడ మున్సిపాలిటీ పరిధి నేతావత్ తండా సమీపంలో ఖమ్మం–వరంగల్ హైవేపై ఆదివారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. నర్సింహులపేట మండలం జయపురం గ్రామానికి చెందిన నరేష్ (32) పని నిమిత్త భార్య స్వప్నతో కలిసి బైక్‌పై మరిపెడ మండల కేంద్రానికి వచ్చాడు. తిరిగి జయపురం వెళ్తున్న క్రమంలో నేతావత్ తండా సమీపంలో వరంగల్ నుంచి ఖమ్మం వైపునకు వెళ్తున్న లారీ.. మరో లారీని ఓవర్ టేక్ చేస్తూ ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీకొంది. దీంతో నరేష్ రోడ్డుపై ఎగిరి పడి అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదం జరిగిన అనంతరం లారీని ఆపకుండా డ్రైవర్ పరారైనట్లు స్థానికులు తెలిపారు.



కూలి పనికి వెళ్లి.. మృత్యుఒడికి

● వడ్లు తూర్పార పట్టే ఫ్యాన్ తగిలి బాలుడి మృతి



ఈశ్వర్ (ఫైల్)

దంతాలపల్లి : వడ్లు తూర్పార పట్టేందుకు కూలి పనికి వెళ్లిన ఓ బాలుడు ఫ్యాన్ తగలడంతో మృతిచెందాడు. మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి మండలం తూర్పుతండా గ్రామ పంచాయతీ పరిధి మేఘ్యతండాలో ఆదివారం ఈ విషాదకర ఘటన చోటుచేసుకుంది. భూక్యా వెంకన్న–పార్వతి దంపతులకు ఓ కూతురు, ఇద్దరు కుమారులు. అయితే మండలంలోని రామవరం గ్రామానికి చెందిన రైతు నీలకుర్తి వెంకటరెడ్డి వద్ద వెంకన్న పాలేరుగా పనిచేస్తున్నాడు. వెంకన్న పెద్ద కుమారుడు ఈశ్వర్(17) ఇటీవలే ఇంటర్మీడియట్ పూర్తిచేశాడు. వేసవి సెలవులు రావడంతో తన తండ్రి జీతం ఉన్న రైతు పొలంలో ఫ్యాన్‌తో వడ్లు తూర్పార పట్టేందుకు స్నేహితులతో కలిసి వెళ్లాడు. కాగా ప్రమాదవశాత్తు ఫ్యాన్ తగలడంతో ఈశ్వర్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే చికిత్స నిమిత్తం తొర్రూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా, పరిశీలించిన వైద్యులు అప్పటికే ఈశ్వర్ మృతిచెందినట్లు ధ్రువీకరించారు. ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు బాలుడి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అప్పటి వరకు తమతో కలిసి పనిచేసిన ఈశ్వర్ మృతిచెందడంతో, గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. కాగా తూర్పార పట్టేందుకు తెచ్చిన ఫ్యాన్ ఏర్పాటులో తగిన జాగ్రత్తలు తీసుకోకుండా బాలుడి మృతికి కారణమైన రైతు వెంకటరెడ్డిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కరుణాకర్ తెలిపారు.

నేటినుంచి పలు రైళ్లు రద్దు

● కాజీపేట, విజయవాడ మార్గంలో క్లోజ్
● ఇబ్బందులు పడనున్న ప్రయాణికులు

డోర్నకల్ : సికింద్రాబాద్ డివిజన్ పరిధిలో చేపట్టిన రోలింగ్ కారిడార్ ప్రోగ్రాంతో కాజీపేట, విజయవాడ మార్గంలో సోమవారం నుంచి పలు రైళ్లు రద్దు కానున్నాయి. మే 22వ తేదీ వరకు ఈ రద్దు కొనసాగనుంది. వరంగల్, విజయవాడ మార్గంలో పుష్‌పుల్, గోల్కొండ, కృష్ణా, ఇంటర్‌సిటీ లాంటి రైళ్లు పేద, మధ్య తరగతి ప్రజలతో పాటు వ్యాపారులు, ఉద్యోగుల ప్రయాణానికి కీలకమైనవి. వ్యాపారాలు, ఉద్యోగవేళలతో పాటు ఆసుపత్రులు, వ్యాపారాలకు వెళ్లే సమయాలకు ఈ రైళ్లు అనుకూలంగా ఉన్నాయి. దీంతో రోజూ వేలాదిమంది ఈ రైళ్లపై ఆధారపడుతున్నారు. ఈ నేపథ్యంలో ఈ రైళ్ల రద్దుతో వేసవి సెలవుల్లో విహార, తీర్థయాత్రలకు వెళ్లేవారు, దూర ప్రయాణాలు చేసేవారు ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశాలు ఉన్నాయి.

ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం కష్టమే..

ప్రస్తుతం తెలంగాణ ప్రభుత్వం మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించడంతో బస్సులన్నీ రద్దీగా నడుస్తున్నాయి. మహిళలకు ఉచిత ప్రయాణం, వేసవి సెలవులతో పాటు రైళ్ల రద్దుతో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం ఇబ్బందికరంగా మారే అవకాశాలు ఉన్నాయి.

లోక్‌సభ ఎన్నికల సమయంలో కొన్ని రైళ్లు..

మే 13న లోక్‌సభ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో రద్దయిన కొన్ని రైళ్లను వారం రోజుల పాటు పునరుద్ధరించనున్నారు. మే 10 నుంచి 15వ తేదీ వరకు కృష్ణా, ఇంటర్‌సిటీ, గోల్కొండ, శాతవాహన రైళ్లను నడపనున్నారు.

డోర్నకల్ జంక్షన్ పరిధిలో రద్దయిన రైళ్ల వివరాలు..

- పుష్‌పుల్ రైలు 29, 04 నుంచి 22, 05, 2024 వరకు,
- భద్రాచలం డెమో రైలు 22, 04 నుంచి 10, 05, 2024 వరకు
- శాతవాహన ఎక్స్‌ప్రెస్ 22, 04 నుంచి 10, 05, 2024 వరకు, 16, 05, నుంచి 22, 05, 2024 వరకు.
- గోల్కొండ ఎక్స్‌ప్రెస్ 22, 04 నుంచి 10, 05, 2024 వరకు, 16, 05, నుంచి 22, 05, 2024 వరకు.
- ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్ 22, 04 నుంచి 10, 05, 2024 వరకు, 16, 05, నుంచి 22, 05, 2024 వరకు.
- కృష్ణా ఎక్స్‌ప్రెస్ 22, 04 నుంచి 10, 05, 2024 వరకు, 16, 05, నుంచి 22, 05,2024 వరకు.

గౌతమ్‌కుమార్ అంత్యక్రియలు పూర్తి..

● 21న అమెరికాలో రోడ్డు ప్రమాదంలో మృతి.. ఆదివారం స్వగ్రామానికి చేరిన మృతదేహం
● కన్నీరుమున్నీరుగా విలపించిన తల్లిదండ్రులు, బంధువులు



గౌతమ్‌కుమార్ (ఫైల్)

స్టేషన్‌ఘన్‌పూర్: అమెరికాలో ఈ నెల 21వ తేదీన జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ మండలం శివునిపల్లి గ్రామానికి చెందిన బీటెక్ విద్యార్థి పార్శి గౌతమ్‌కుమార్ అంత్యక్రియలు అశ్రునయనాల మధ్య పూర్తయ్యాయి. గౌతమ్‌కుమార్ మృతదేహం ఆదివారం తెల్లవారుజామున స్వగ్రామం శివునిపల్లికి చేరగా అదే రోజు ఉదయం 10 గంటలకు దహన సంస్కారాలు పూర్తయ్యాయి. శివునిపల్లికి చెందిన ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు, ప్రముఖ వ్యాపారి పార్శి కమల్‌కుమార్ గుప్తా, పద్మ దంపతుల పెద్ద కుమారుడు గౌతమ్‌కుమార్ అమెరికాలోని ఆరిజోన స్టేట్‌లో ఆరిజోన యూనివర్సిటీలో బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతూ ఈ నెల 21న అక్కడ జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన విషయం విదితమే. కాగా, కుమారుడిని కడసారి చూసేందుకు తల్లిదండ్రులు వారం రోజుల నుంచి ఎదురుచూస్తుండగా లాంఛనాలు పూర్తి చేసి ఆదివారం ఉదయం గౌతమ్‌కుమార్ మృతదేహాన్ని శివునిపల్లిలో ఇంటికి చేర్చారు. అక్కడ కుమారుడి మృతదేహాన్ని చూసిన తల్లిదండ్రులు, కుటుంబీకులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపించారు. అమెరికాలో ఉన్నత చదువు పూర్తి చేసి తమ కలలను సాకారం చేస్తానదనుకున్న కుమారుడు శవమై రావడంతో తల్లిదండ్రులు గౌతమ్ మృతదేహం మీదపడి దిక్కులు పిక్కటిల్లేలా రోదించారు.

అంతిమయాత్రలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే రాజయ్య

గౌతమ్‌కుమార్ మృతదేహం వచ్చిందనే సమాచారం అందుకున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య.. శివునిపల్లికి చేరుకున్నారు. గౌతమ్ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. మృతుడి కుటుంబీకులను పరామర్శించారు. అనంతరం అంతిమయాత్రలో పాల్గొన్నారు.

సెక్యులరిజం పరిరక్షణకు ముందుండాలి

● సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ నందిని సిధారెడ్డి
● లౌకిక విలువలు–సాహిత్యంపై రాష్ట్రస్థాయి సదస్సు



సదస్సులో మాట్లాడుతున్న నందిని సిధారెడ్డి

కేయూ క్యాంపస్: దేశంలో సెక్యులరిజం పరిరక్షణకు కవులు, రచయితలు ముందుండి కృషి చేయాల్సిన అవసర ఉందని తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ డాక్టర్ నందిని సిధారెడ్డి అన్నారు. ఆదివారం కాకతీయ యూనివర్సిటీ సెనేట్‌హాల్‌లో సమూహ సెక్యులర్ రైటర్స్ ఫోరం ఆధ్వర్యంలో 'లౌకిక విలువలు–సాహిత్యం' అంశంపై ప్రారంభోపన్యాసం చేశారు. సెక్యులరిజం భారతీయులది కాదన్నప్పుడు విదేశాలకు చెందిన ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఎందుకు వాడుకుంటున్నారనారని ప్రశ్నించారు. స్వాతంత్ర్య కాలం నుంచి భారతీయ సమాజంలో లౌకిక విలువలను ప్రజలు అనుసరించారని గుర్తుచేశారు. వర్ణ ధర్మం ఆధునిక సమాజంలో చెల్లదని, అస్తిత్వ సమూహాల మధ్య సమన్వయంతో ఐక్య సంఘటనగా ముందుకు సాగాలని కోరారు. సీనియర్ కవి డాక్టర్ యాకూబ్ అధ్యక్షతన నిర్వహించిన ఈ సదస్సులో సాహితీ విమర్శకుడు గుంటూరు లక్ష్మీనర్సయ్య, లౌకిక రైటర్స్ ఫోరం కన్వీనర్ కాత్యాయనీ విద్మహే, ప్రముఖ రచయిత జిలుకర శ్రీనివాస్, ఖాదర్‌మోయినుద్దీన్ ప్రసంగించారు. కేయూ రిజిస్ట్రార్ ఆచార్య పి.మల్లారెడ్డి, రచయితలు అంపశయ్యనవీన్, అనిశెట్టి రజిత, రూపారుక్మిణి, పసునూరి రవీందర్, మెర్సీమార్గరేట్, గంట రామిరెడ్డి, ఏకే.ప్రభాకర్, గుమ్మడి అనురాధ, నాళేశ్వరం, రామాచారి, కోడం కుమారస్వామి, సైకిబాబా తదితరులు పాల్గొన్నారు.

ఎంజేపీ, ఆర్‌జేసీ, ఆర్‌డీసీ సెట్ ప్రశాంతం

● 6,574 మంది విద్యార్థులకు 5,879 మంది హాజరు



పరీక్ష కేంద్రంలో పరిశీలిస్తున్న ఆర్‌సీఓ మనోహర్‌రెడ్డి

విద్యారణ్యపురి: ఉమ్మడి వరంగల్ జిల్లాలో మహాత్మా జ్యోతిరావుపూలే బీసీ గురుకుల కళాశాలల్లో ఇంటర్మీడియట్, సాంఘిక, గిరిజన సంక్షేమ గురుకుల, మహాత్మాజ్యోతిరావుపూలే బీసీ గురుకుల డిగ్రీ కళాశాలల్లో ఈ విద్యాసంవత్సరం(2024–25) ప్రవేశాలకు ఆదివారం నిర్వహించిన పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. హనుమకొండ, వరంగల్, మహబూబాబాద్, జనగామ, ములుగు, జయశంకర్‌భూపాలపల్లి జిల్లా కేంద్రాల్లో ఏర్పాటు చేసిన 37 సెంటర్లలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్షలు నిర్వహించారు. మొత్తం 6,574 మంది విద్యార్థులకు 5,879 మంది (89.43శాతం) హాజరయ్యారు. ఇందులో ఆర్‌డీసీకి 2,237 మంది విద్యార్థులకు 1,862(83.24శాతం) పరీక్ష రాశారు. మహాత్మాజ్యోతిరావుపూలే బీసీ గురుకులాల ఆర్‌సీఓ మనోహర్‌రెడ్డి, ఆయా జిల్లాల కోఆర్డినేటర్లు సరిత, సుదర్శన్ రెడ్డి, అనిత, వెంకటేశ్వర్లు పర్యవేక్షించారు.

వృద్ధ దంపతులకు మళ్లీ పెళ్లి



వధూవరులుగా వృద్ధ దంపతులు

నెల్లికుదురు: మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం వస్రాం తండాలో వృద్ధ దంపతులకు కుటుంబ సభ్యులు ఆదివారం మళ్లీ వివాహం చేసి సంబురాలు జరుపుకున్నారు. వస్రాం తండాకు చెదిన గుగులోతు లాలి–సమిడానాయక్ దంపతులకు నలుగురు కుమారులు, ఒక కూతురు ఉంది. సమిడానాయక్ వయసు 80 ఏళ్లు ఉంటుంది. సహస్ర చంద్ర దర్శన్ వేడుకలో భాగంగా శాస్త్రోక్తంగా వివాహం నిర్వహించి బంధుమిత్రులకు విందు భోజనం ఏర్పాటు చేశారు.

సదస్సును అడ్డుకున్న ఏబీవీపీ



వాగ్వాదం చేస్తున్న ఏబీవీపీ నాయకులు

సదస్సులో మధ్యాహ్న భోజన విరామం తర్వాత సెషన్ కొనసాగుతుండగా ఏబీవీపీకి చెందిన పలువురు సదస్సును అడ్డుకుని అనుమతి ఎవరిచ్చారంటూ నిర్వాహకులతో వాగ్వాదానికి దిగారు. కాగా.. కవులు పసునూరి రవీందర్, నరేశ్‌కుమార్ సూఫీపై ఏబీవీపీ నాయకులు దాడి చేశారని నిర్వాహకులు ఆరోపించారు. ఈక్రమంలో ఇరువురి మధ్య వాగ్వాదం జరిగింది. ఏబీవీపీ నాయకులు సదస్సు ఫ్లెక్సీని చించేశారు. కేయూ ఎస్సై ఏబీవీపీ నాయకులను అక్కడి నుంచి తీసుకెళ్లడంతో సదస్సు ముగింపు సభ కొనసాగింది. కాగా.. పరిపాలన భవనం వద్ద వేచి ఉన్న ఏబీవీపీ నాయకులు.. కవులు, రచయితలు సెనేట్ హాల్ నుంచి బయటకు రాగానే దాడికి యత్నించడంతో ఉద్రిక్తత చోటు చేసుకుంది. పోలీసులు కవులను, రచయితలను.. నిర్వాహకులను అక్కడి నుంచి పంపించారు. కవులు, రచయితలపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు సమూహ రైటర్స్ ఫోరం కన్వీనర్లు, నిర్వాహకులు ప్రొఫెసర్ కాత్యాయనీ విద్మహే, మెట్టు రవీందర్ ఆదివారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు.

వీసీ, రిజిస్ట్రార్‌పై చర్యలు తీసుకోవాలి..

ఎలక్షన్ కోడ్‌ను ఉల్లంఘిస్తూ సెక్యులర్ రైటర్స్ ఫోరం ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి అనుమతి ఎలా ఇస్తారని ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు మాచర్ల రాంబాబు ఒక ప్రకటనలో ప్రశ్నించారు. కేయూ వీసీ, రిజిస్ట్రార్‌పై చర్యలు తీసుకోవాలని కేయూ పోలీస్‌స్టేషన్‌లో, ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు. రాముడిని అవమానపరుస్తూ, రామాయణాన్ని వక్రీకరిస్తూ హిందువుల మనోభావాలు దెబ్బతీసేలా నిర్వహించినందుకే ఏబీవీపీ నేతలు సదస్సును అడ్డుకున్నారని పేర్కొన్నారు.